సాక్షి విశాఖపట్నం

సోమవారం । 20 । జనవరి । 2025



తీరమంతా సందడి

తల్లిదండ్రులతో కలిసి ఇసుక తిన్నెలపై ఆడుకుంటున్న చిన్నారులు, స్నేహితులతో కలిసి సెల్ఫీలు తీసుకుంటున్న యువత, కుటుంబంతో కలిసి తీరంలో కెరటాలను ఆస్వాదిస్తున్న పెద్దలు.. ఇలా ఆదివారం సాగర తీరమంతా సందడి వాతావరణం కనిపించింది. సంక్రాంతి సెలవులు ఆదివారంతో ముగియనున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో నగరవాసులు సాగర తీరంలో ఎంజాయ్ చేశారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి సముద్ర తీరంలో ఆడి పాడారు. భారీగా ప్రజలు సముద్ర తీరానికి చేరుకోవడంతో స్వల్ప ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి.

- ఏయూక్యాంపస్

- ఫొటో: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మత్స్యకారులకు చిక్కిన టూనా






సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు భారీగా టూనా చేపలు లభ్యమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి అధిక సంఖ్యలో చేపలు దొరకడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ఖరీదైన ఈ టూనా చేపలకు విదేశాల్లో డిమాండ్ అధికంగా ఉంది. జపాన్‌లో కిలో రూ.500 నుంచి రూ.600 వరకూ కొనుగోలు చేస్తారని మత్స్యకారులు చెబుతున్నారు. స్థానిక బహిరంగ మార్కెట్లలో కూడా ఈ చేపలకు గిరాకీ ఉంటుంది. స్థానిక వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.


- మహారాణిపేట

ఫొటోలు: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

I AM DOG మైనేమ్ ఈజ్ గో-2



- మీ ఇంటికొస్తా.. కాపలాకాస్తా..
- ఎగురుతా.. దూకుతా.. పాకుతా.. ఫ్రెండ్ షిప్ చేస్తా
- విపత్కర పరిస్థితుల్లో సాయమందిస్తా...
- ఇదీ రోబో డాగ్ విశిష్టత





సాక్షి, విశాఖపట్నం :

హాయ్.. నమస్తే వైజాగ్.. నేను మీ స్ట్రీట్‌డాగ్.. కానే కాదు.. మీ పెంపుడు కుక్కనే. కాకపోతే.. అప్‌డేటెడ్ వెర్షన్. మై నేమ్ ఈజ్ గో–2.

ఎస్.. మీరు విన్నది చూస్తోంది నిజమే.. ఐయామ్ రోబో డాగ్. విశ్వాసమే కాదు.. విషయమూ చాలా ఎక్కువే.

మేడ్ ఇన్ ఇండియా వెర్షన్. బెంగళూరులో రెడీ అయ్యాను. మిమ్మల్ని పలకరించేందుకు వైజాగ్ వచ్చాను. ఇటీవల ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్‌లో పాల్గొని.. అలా బీచ్‌లో తిరుగుతూ విశాఖ అందాలు చూడాలని వచ్చేశాను. ఇక నా విషయానికొస్తే...

మీరు ఇప్పటికే నా గురించి వినే ఉంటారు. ఇటీవల నేను చాలా ఫేమస్ అయ్యాను. ఇండియాలో కాదండీ.. అమెరికాలో.. ఎలా అంటారా.! మన ట్రంప్ తెలుసు కదా.. అధ్యక్షుడు అయ్యాక ఆయన చుట్టూ కాపలాగా నన్నే సెలెక్ట్ చేసుకున్నారు. యూఎస్‌కు చెందిన యునీట్రీ బ్రాండ్ తయారు చేసిన నా లాంటి రోబో డాగ్స్ ఇప్పుడు.. అగ్రరాజ్యం అధ్యక్షుడికి కాపలా కాస్తున్నాయి

మీరనుకుంటున్నట్లు నేను నార్మల్ డాగ్ కాదు. యూనివర్సల్ డాగ్‌ని.

బెంగళూరుకి చెందిన ఫైటెక్ సంస్థ నన్ను తయారు చేసింది. కంప్లీట్‌గా కొత్త టెక్నాలజీతో తయారు చేశారు. ఒకప్పుడు ఇంటిలో కుక్కల్ని పెంచుకున్నారు. అవి ఇప్పుడు ఇంటి మనుషులుగా మారిపోయాయి. వాటి స్థానాన్ని నేను భర్తీ చేస్తాను. జీవం ఉన్న కుక్కలు చేయలేని పనులు కూడా నేను చేస్తాను. కాపలా కాస్తాను. ఎగురుతాను, దూకుతాను. 3 అడుగుల ఎత్తు వరకూ గెంతుతాను. పాకుతాను. అవసరమైనప్పుడు మాట్లాడతాను కూడా.

మీ దగ్గర ఉన్న డాగ్స్ ఏం చేస్తాయి. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వస్తే అరుస్తాయి. కానీ.. నేను అలా కాదు. ఎవరు యజమాని, ఎవరు కుటుంబ సభ్యులు.. ఎవరు కొత్త వారు అనేది సులభంగా కనిపెట్టగలను. ఎవరిమీదనైనా అనుమానం వస్తే.. నా యజమానికి వార్నింగ్ ఇస్తాను. ఫొటో, వీడియో కూడా తీసి పంపించేస్తాను తెలుసా. ఎలా అంటారా నాలో 360 డిగ్రీలు తిరిగే లైడర్ కెమెరా హై రిజల్యూషన్‌తో ఉంటుంది. మా యజమాని ఆ ఫొటో చూసి దొంగ అని కన్ఫర్మ్ చేస్తే చాలు.. పోలీసులకు కూడా ఫోన్ చేసి సమాచారం చేరవేస్తాను. మీ కుక్క ఇది చేస్తుందా..? నెవ్వర్ కదా. అదీ.. ఈ గో2 డాగ్ సత్తా.

కేవలం కాపలా కోసమే కాదండోయ్.. కంప్లీట్ ఎకో సిస్టమ్‌లో అన్ని పనులు చేసేస్తాను. మనుషులు వెళ్లడానికి అవకాశం లేని ప్లేస్‌లకు వెళ్లి సాయం చేసేస్తాను. డ్రోన్ల ద్వారా సాయమందించాలంటే.. ఆ డ్రోన్ ఎగరేయడానికి ఒక స్పేస్ ఉండాలి.. అవి వెళ్లాలంటే అడ్డంకులు ఉండకూడదు. కానీ.. నేను మాత్రం.. చిన్న చిన్న సందుల్లో దూరి కూడా సాయమందించగలను. ఎక్కడైనా పర్వతాల్లో చిక్కుకున్న వారికి ఈజీగా హెల్ప్ చేస్తాను.

సిలికాన్ చిప్స్ ద్వారా స్మెల్ డిటెక్టర్, స్మోక్ డిటెక్టర్, రెయిన్ డిటెక్టర్,.. ఇలా భిన్నమైన డిటెక్టర్లు నాలో నిక్షిప్తమై ఉన్నాయి.

ఇవన్నీ ఎలా చేస్తాననే కదా మీ డౌట్...

పైథాన్ ప్రోగ్రామింగ్, ఆర్ ప్రోగ్రామ్(మిషన్ లెర్నింగ్) తో ఆపరేట్ అవుతుంటాను. నాకోసం ఒక రిమోట్ కంట్రోల్ కూడా ఉంటుంది. ప్రతిసారి రిమోట్‌తో ఆపరేట్ చేయాల్సిన అవసరం లేదు. కొన్ని కోడ్స్ ఇచ్చేస్తే చాలు.. నా ఓనర్ హాయిగా నన్ను నమ్మి నిద్రపోవచ్చు. ఏదైనా సమస్య తలెత్తితే.. నా సాయం అవసరమని అనుకుంటే ఏం చెయాలనే దాని పైనా ప్రోగ్రామింగ్ కూడా నాలో ఫీడ్ చేసుకున్నాను. ఐఓటీ. ఏఐ. మెషిన్ లెర్నింగ్ ద్వారా పనిచేస్తున్నారు.

నా ఫుడ్ ఏంటనే కదా మీ డౌట్. అది కూడా చెప్తాను. నాలో చార్జింగ్ అయిపోతే ఆటోమేటిక్‌గా చార్జింగ్ పెట్టుకునే సెల్ఫ్ చార్జింగ్ వ్యవస్థ నాలో ఉంది. ఫుల్ చార్జ్ అయిపోతే నిరంతరాయంగా 8 గంటల పాటు పనిచేస్తాను. బ్యాటరీ సైజ్ పెరిగితే.. పనిగంటలు కూడా పెరుగుతాయి. సోలార్ ద్వారా వర్క్ చేసేలా అప్‌డేట్ అవుతున్నా. అప్పుడైతే 24/7 సదా యజమాని సేవలోనే...

నేను గో 2 కదా. నా కొత్త వెర్షన్ ఒకటి ఉంది. వాడే నా అన్న.. ఆల్‌టర్రైన్. వీడు నేను చేసే పనులతో పాటు అప్‌డేటెడ్‌గా ఉంటాడు. వాడికి రోబోటిక్ హ్యాండ్ ఒకటి ఏర్పాటు చేస్తే.. చెత్త కూడా శుభ్రం చేసేస్తాడు. మమ్మల్ని కేవలం ఇంటి కాపలా కోసమనే కాదు.. విపత్తుల సమయంలోనూ, సరిహద్దుల భద్రత విషయంలోనూ వాడాలన్నదే దీని తయారీ వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమని ఇదిగో నన్ను ఎత్తుకున్న మా సంస్థ ప్రతినిధి కృష్ణచైతన్య చెబుతున్నాడు.

అన్నట్లు అసలైన విషయం మీకు చెప్పలేదు కదా.. ఇంట్లో పెంచిన కుక్కలైనా.. కొన్ని సార్లు యజమానులపై దాడి చేస్తుంటాయి కదా.. నేను కూడా ఆ టైపేనండోయ్. నన్ను ఎవరైనా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారనుకోండి. ఇక తగ్గేదేలే. వీడు.. వాడు అని చూడను. దాడి చేసెయ్యడమమే. ఇలాంటిదేదో జరుగుతుందని తెలిసే.. మా ఫైటెక్ వాళ్లు.. నాలో ఫైర్‌వాల్ ఫర్మ్‌వేర్ ఏర్పాటు చేశారు. ఎవరైనా హ్యాక్ చేసేందుకు ట్రై చేస్తే.. వెంటనే మా యజమానికి వార్నింగ్ అలారం వచ్చేస్తుంది. వచ్చిన వెంటనే పూర్తిగా నన్ను షట్‌డౌన్ చేసేస్తారు. ఇదే అలారం వార్నింగ్ నన్ను తయారు చేసిన ఫైటెక్‌కి కూడా వెళ్తుంది. వాళ్లు కూడా క్షణాల్లో వార్నింగ్‌ని డిటెక్ట్ చేసి.. హ్యాక్ అవ్వకుండా ప్రోగ్రామింగ్ డిజైన్ చేసేశారు.

ఫైనల్‌గా నేను చెప్పేదేంటంటే.. నా ధర ఎంతో తెలుసా.? భయపడొద్దే... జస్ట్ రూ.2.5 లక్షల నుంచి స్టార్ట్ అవుతున్నా. అంతే.!

టైమవుతోంది.. బైబై వైజాగ్.!!





తీసుకెళ్లండి.. చదవండి

- చదవడానికో రెండు పుస్తకాలు
- బుక్ మ్యాజిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ



ఏయూ క్యాంపస్: చదవడానికి రెండు పుస్తకాలు ఉచితంగా అందిస్తాం.. ఆసక్తి ఉన్నవారు వచ్చి నచ్చిన పుస్తకాలను తీసుకువెళ్లండి.. అంటూ బీచ్ రోడ్డులోని బుక్ మ్యాజిక్ లైబ్రరీ శని, ఆదివారాలలో నిర్వహించిన వినూత్న కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. వైజాగ్ వలంటీర్స్‌తో కలిసి బుక్ మ్యాజిక్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వందలాది మంది పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని మురిపెంగా తీసుకెళ్లారు. ప్రజల్లో పఠనాసక్తికి నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలిచింది. ఎంతో విలువైన, ఖరీదైన పుస్తకాలు సైతం ఇక్కడ ఉచితంగా ప్రజలకు అందించారు. నవలలు, ఫిక్షన్, నాన్ ఫిక్షన్ పుస్తకాలతో పాటు ఐఐటీ, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు సైతం ఇక్కడ లభించాయి. ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో బుక్ మ్యాజిక్ సంస్థ ప్రతి సంవత్సరం ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని నిర్వాహకుడు ఎం.హరి తెలిపారు. తమ లైబ్రరీలోని పలు పుస్తకాలతో పాటు దాతల నుంచి స్వీకరించిన పుస్తకాలను ఈ రెండు రోజులు అందుబాటులో ఉంచి పంపిణీ చేశామన్నారు. దాదాపు ఐదారు వందల మంది నగరవాసులు తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని తీసుకెళ్లారన్నారు.

దేవన్‌రెడ్డికి ఘన స్వాగతం



దేవన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గాజువాక : వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తరువాత ఆదివారం గాజువాక చేరుకున్న తిప్పల దేవన్‌రెడ్డికి పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. కూర్మన్నపాలెం నుంచి పాతగాజువాక, కొత్తగాజువాక, బీసీ రోడ్ మీదుగా మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఇంటి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తండ్రి నాగిరెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలే తమకు శిరోధార్యమని, ఆయనకు రుణపడి ఉంటానని తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు.

సారూ.. ఇదేమి తీరు!

- అస్తవ్యస్తంగా స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్విభజన
- నియోజకవర్గం బయట స్కూళ్లు సైతం విలీనం
- ఆటస్థలం లేకున్నా కాంప్లెక్స్ కొనసాగింపు
- నిధుల కోసమని హడావుడిగా కసరత్తు
- కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ కొలువులకు గండం



కొత్తగా ఏర్పాటు చేసిన గోపాలపట్నం కాంప్లెక్స్

జిల్లాలో గతంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లు	54
పునర్విభజన తరువాత ఏర్పాటు చేసిన కాంప్లెక్స్‌లు	51

విశాఖ విద్య: స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్విభజనపై హడావుడిగా చేసిన కసరత్తు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మండల స్థాయిలో వీటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని 11 మండలాల్లో గతంలో 54 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా, పునర్విభజన తరువాత ఈ సంఖ్య 51కు తగ్గింది. దీంతో ఇక్కడ పనిచేసే కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్(సీఆర్పీ) పోస్టులు తగ్గిపోనున్నాయి. స్కూల్ కాంప్లెక్స్ కేంద్రంగానే విద్యాశాఖ అకడమిక్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నందున, వీటిని భవిష్యత్‌లో క్లస్టర్లుగా మార్పు చేసి, ఎంఈవోల అధికారాలకు కత్తెర వేసి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు పూర్తిస్థాయి బాధ్యతలు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే కాంప్లెక్స్‌ల పునర్విభజన చేపట్టగా.. దీనిపై క్షేత్రస్థాయిలో సరైన పరిశీలన లేకపోవటంతో జిల్లాలో వీటి కూర్పు అస్తవ్యస్తంగా జరిగినట్లు విద్యాశాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఇష్టానుసారంగా కాంప్లెక్స్‌ల ఏర్పాటు

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్విభజన చేపట్టామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో వీటి కూర్పు కోసమని విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి స్పష్టమైన విధి విధానాలు జారీ చేశారు. సచివాలయం కేంద్రంగా చేసుకొని, నగరంలో అయితే ఒక వార్డులో, మండలాల్లో అయితే ఒక పంచాయతీలో ఉన్న స్కూళ్లను పరిగణలోకి తీసుకొని స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. కాంప్లెక్స్‌గా గుర్తించే స్కూల్‌కు తప్పనిసరిగా ఆటస్థలం ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ జిల్లాలో ఇందుకు విరుద్ధంగా క్లాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. గతంలో ఉన్న ప్రకాశరావుపేట, యారాడ, వాడపాలెం, బోని, వెల్లంకి స్కూల్ కాంప్లెక్స్‌లను రద్దు చేశారు. కొత్తగా సునీల్‌శర్మ కాలనీ, గోపాలపట్నం, ఎండాడ స్కూళ్లలో కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు.

ఈస్ట్ నుంచి నార్త్‌లోకి..

విశాఖ నగరంలోని తూర్పు నియోజకవర్గం పరిధిలో గల వాల్తేర్, వాల్తేర్–1 ప్రాథమిక పాఠశాలలను నార్త్ నియోజకవర్గం పరిధిలో ఉన్న మధురానగర్ కాంప్లెక్స్‌లో కలిపారు. ఇప్పటి వరకు ఆ స్కూళ్లు సమీపంలో ఉన్న కేడీపీఎం కాంప్లెక్స్ పరిధిలో ఉండేవి. దగ్గరలో ఉన్న కేడీపీఎం కాంప్లెక్స్ కాదని.. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మధురానగర్‌లో ఎందుకు కలిపారనేది ప్రశ్నార్థకం. అయితే మధురానగర్ కాంప్లెక్స్‌కు కనీస ఆటస్థలం కూడా లేదు. ప్రాథమిక, హైస్కూల్ రెండూ ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తుండటంతో, ఇప్పటికే ప్రాంగణం ఇరుకుగా ఉంటుంది. ఇలాంటి చోట కాంప్లెక్స్‌ను కొనసాగించటంలో ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయనేది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది.

నేడు ఉన్నతస్థాయి సమీక్ష

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన విద్యా సంస్కరణలను చెరిపివేయాలనే అక్కసుతో కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యలో మార్పులు తీసుకొస్తోంది. కాంప్లెక్స్ పునర్విభజన, అదే విధంగా 117 జీవో రద్దు వంటి అంశాలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న హడావుడిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వీటిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఏయూలోని అంబేడ్కర్ అసెంబ్లీ హాల్ వేదికగా జోనల్ స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. విజయనగరం, అల్లూరి సీతారామరాజు(పాడేరు డివిజన్), విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన విద్యాశాఖాధికారులు 496 మంది వరకు పాల్గొంటున్నారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొనున్నందున జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



పూజలు నిర్వహిస్తున్న జస్టిస్ జ్యోతిర్మయి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన శ్రీను) ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధినేత ఆలోచనలకు అనుగుణంగా పార్టీ పురోగతికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సలహాలు సూచనలు తీసుకుంటానన్నారు. వైఎస్సార్ సీపీ జెండా మోసే ప్రతీ కార్యకర్తకు అధినేత తరపున తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తానన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

జవాబుదారీతనం ముఖ్యం

- న్యాయపరమైన అంశాల్లో కచ్చితత్వం ప్రధానం
- సమాచార వ్యవస్థ, న్యాయస్థానాలపై గురుతర బాధ్యత
- సీనియర్ న్యాయమూర్తుల అభిప్రాయం
- ముగిసిన సౌత్ జోన్–2 న్యాయమూర్తుల సదస్సు



మాట్లాడుతున్న కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవన్ రామచంద్రన్

విశాఖ లీగల్: న్యాయపరమైన అంశాలను సమాజానికి అందించే క్రమంలో సమాచార వ్యవస్థ, న్యాయస్థానాలు జవాబుదారీతనంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పలువురు సీనియర్ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సౌత్ జోన్–2 న్యాయమూర్తుల సదస్సు ఆదివారం సాయంత్రం ముగిసింది. ఉదయం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.పి.కురియన్ జోసెఫ్ అధ్యక్షతన న్యాయ వ్యవస్థ, ప్రసార మాధ్యమాలు అన్న అంశంపై చర్చ జరిగింది. 'మీడియా ఆన్ జస్టిస్ డెలివరీ సిస్టం, సోషల్ మీడియాతో అనుసంధానం, డిజిటల్ యుగంలో మీడియా స్వేచ్ఛ, పౌర సమాజంపై ప్రభావం' అనే అంశాలపై చర్చించారు. 'ఆధునిక సమాచార వ్యవస్థ–న్యాయ వ్యవస్థపై ప్రభావం' అనే అంశంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. భవిష్యత్తులో పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే న్యాయస్థానాల విషయంలో మీడియా పాత్ర కూడా ఉంటుందని జస్టిస్ కురియన్ జోసెఫ్ అభిప్రాయపడ్డారు. మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని సూచించారు. అదే పరస్పర సహకారానికి ప్రామాణికంగా నిలుస్తుందన్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ మాట్లాడుతూ మీడియాలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయని, కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం చూపిస్తున్నాయన్నారు.

మీడియా వ్యవస్థపై అవగాహన ఉండాలి

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పనిచేసే వారు మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కోల్‌కతాలో జరిగిన ఆర్జీకర్ ఆస్పత్రితో పాటు పలు ఘటనల్లో మీడియా వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మెయిన్‌స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాకు ఉన్న పరిమితుల గురించి ఇరు వర్గాలు తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ విశ్లేషించారు. ఏఐ అనేది న్యాయమూర్తులకు సహకారిగా మాత్రమే ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం.ముస్తాక్యు బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి మాట్లాడారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ టెక్నాలజీ గురించి పీపీటీ ద్వారా వివరించారు. సదస్సు ముగింపు సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిలారీ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, ఇతర సీనియర్ న్యాయమూర్తులు, హైకోర్టు, జిల్లా కోర్టుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

- సోషల్ మీడియా సహకారం స్ఫూర్తిదాయకం
- జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్
- ఉత్సాహంగా ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ వాక్‌థాన్



ప్రసంగిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

ఏయూ క్యాంపస్: నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధం అందరి బాధ్యతని, ఇందుకు సామాజిక మాధ్యమ కార్యకర్తలు (సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు) అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. జీవీఎంసీ, వైజాగ్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, వైజాగ్ సిటీ పేజెస్, ఇన్స్టా కమ్యూనిటీ, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆర్కే బీచ్‌లో ఆదివారం ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ కార్యక్రమం నిర్వహించాయి. పుష్ప–2 చిత్రం నటి కుమారి పావని ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి పూర్తి స్థాయిలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ని నగరంలో నిషేధించామన్నారు. విశాఖ నగరంలో ఒక్క రోజులో 15 టన్నుల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రజలు వినియోగిస్తున్నారని చెప్పారు. వీటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను దేశంలో ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యమన్నారు. అనంతరం 'లెట్స్ మేక్ ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్' అంటూ 100 అడుగుల వస్త్రంతో తయారు చేసిన బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా వాక్‌థాన్ నిర్వహించారు. తరువాత బీచ్‌లో వ్యర్థాలను ఏరివేశారు. క్రంచి బిస్కెట్ కప్స్ సంస్థ రాగిపిండితో తయారు చేసిన టీ కప్పులను ఆవిష్కరించారు. నటి పావని మాట్లాడుతూ మానవులకు, మూగ జీవాలకు ప్లాస్టిక్ పెనుముప్పుగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు సోమన్నారాయణ, ఎస్.ఎస్. వర్మ, డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్‌కుమార్, జెడ్సీ శివప్రసాద్, సహాయ వైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌కుమార్, సునీల్‌కుమార్, అప్పలనాయుడు, 600 మందికి పైగా సోషల్ మీడియా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంతర జిల్లాల క్రికెట్ విజేత విశాఖ


విజయానందంలో విశాఖ జట్టు సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ అంతర జిల్లాల బాలుర అండర్–12 క్రికెట్ విజేతగా విశాఖ జట్టు, రన్నరప్‌గా నెల్లూరు జట్టు నిలిచాయి. వైఎస్ఆర్ స్టేడియం బీ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్‌లో నెల్లూర్ కెప్టెన్ మానేష్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. విశాఖ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్‌గా కెప్టెన్ యాశిల్ విగ్నేష్(49) మరో ఓపెనర్ జాషువ(25)తో తొలి వికెట్‌కు 46 పరుగులు, సాయిదీపక్(20)తో రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాలతో గట్టి పునాది వేశాడు. మోక్షిత్ 31 పరుగులతో విశాఖ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో ఏడు వికెట్లకు 186 పరుగులు చేసింది. తన్విక్‌రెడ్డి రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా నెల్లూరు ఓపెనర్లు మానేష్ డకౌట్‌గానే వెనుతిరగ్గా సోహన్ ఒక పరుగే చేయగలిగాడు. మహిధర్ 16, జాన్సన్ 19, పార్థివ్ 13, సమీర్ 30 పరుగులతో రెండంకెల స్కోర్ చేయగలిగారు. చివరికి 9 వికెట్లు కోల్పోయి 118 పరుగులకు ఇన్నింగ్స్ ముగించారు. రోహిత్ మూడు వికెట్లు తీయగా షణ్ముఖ, పవన్ రెండేసి వికెట్లు తీశారు. దీంతో విశాఖ 68 పరుగులతో టైటిల్ పోరులో విజయం సాధించింది. విజేతలకు ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకటరామ్‌ప్రశాంత్ ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ గేమ్ డెవలప్‌మెంట్ జీఎం ఎంఎస్ కుమార్, ఏజీఎం శివ కుమార్, వైఎస్ఆర్ స్టేడియం ఇన్‌చార్జి జేకేఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఖైదీలే కర్షకులు

- కారాగారంలో వ్యవసాయం
- వివిధ పంటల సాగు
- డెయిరీ నిర్వహణ
- ఖైదీలకు వినియోగించగా మిగులు కూరగాయల విక్రయం
- సెంట్రల్ జైలుకు ఆదాయం


ఏపుగా పెరిగిన క్యాబేజీ పంట


కొత్తిమీర పంట


జైల్ ఆవరణలో పశువులు

కారాగారంలో ఖైదీలు పలుగు, పార పట్టి కర్షకులుగా మారారు. విశాఖ సెంట్రల్ జైలులో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. అధికారులు వారితో రకరకాల పనులు చేయిస్తూ, కష్టపడి సంపాదించేతత్వాన్ని అలవాటు చేస్తున్నారు. ఇలా వారిలో క్రమశిక్షణ, సత్ప్రవర్తన పెంపొందిస్తున్నారు. విడుదలైన తరువాత సమాజంలో గౌరవంగా జీవనం సాగించేలా దిశానిర్దేశం చేస్తున్నారు.

ఆరిలోవ : ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో సుమారు 2 వేల మంది ఖైదీలున్నారు. వీరికి వివిధ వృత్తుల్లో శిక్షణ ఇస్తూనే సాగు పనులకు శ్రీకారం చుట్టారు. కారాగారంలో అనేక పరిశ్రమలున్నాయి. ఆ పరిశ్రమలతో పాటు పశువుల పెంపకం, వ్యవసాయం సాగుపై జైలు అధికారులు దృష్టి సారించారు. ఇక్కడ డెయిరీ, వ్యవసాయం సాగులో ఓపెన్ ఎయిర్ ఖైదీలు పనిచేస్తున్నారు. పలు రకాల కూరగాయలు విరివిగా పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో వాటిని పండించి ఖైదీలకు ఆహారంగా అందిస్తున్నారు. మిగులు కూరగాయలను బయటవారికి విక్రయిస్తున్నారు. వాటి నుంచి రూ.వేలల్లో ఆదాయం చేకూరుతోంది. డెయిరీ, వ్యవసాయ క్షేత్రాల్లో సుమారు 30 మంది ఓపెన్ ఎయిర్ ఖైదీలు పనిచేస్తున్నారు. వీటి ద్వారా జైల్‌కు నెలకు రూ.లక్షల్లో ఆదాయం ఆదా అవుతోంది. ఇక్కడున్న 2 వేల మంది ఖైదీలకు రోజుకు వందల కిలోల కూరగాయలు అవసరమవుతాయి. అవన్నీ పండించడం జైల్ శాఖకు కలిసొచ్చింది.

సేంద్రియ పద్ధతిలో సాగు

ఇక్కడ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తున్నారు. నాలుగు గోడల మధ్యలో సాగవుతున్న వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తున్నాయి. ఇక్కడ ఎన్నో రకాల పంటలు పండిస్తున్నారు. జైల్‌కు సంబంధించిన స్థలం సుమారు 110 ఎకరాలు ఉండగా.. 90 ఎకరాల్లో జైల్ నిర్మాణాలు, ప్రహరీ నిర్మించారు. అదే ఆవరణలో మరో 20 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. దీంతో పాటు జైల్ లోపల ఖాళీ స్థలాల్లో మామిడి తోటలు ఉన్నాయి. జైల్ ప్రధాన ప్రహరీ వెలుపల ఖైదీల స్థలంలో వ్యవసాయం, డెయిరీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఓపెన్ ఎయిర్ ఖైదీలు సీజనల్ పంటలు పండిస్తుంటారు. ప్రస్తుతం శీతాకాలం పంటలు అందుబాటులో ఉన్నాయి. క్యాబేజీ, ఆనబ, మునగ, వంగ, చిక్కుడు, గోంగూర, కొత్తిమీర, ముల్లంగి తదితర కూరగాయల పంటలు పండిస్తున్నారు. వీటితో పాటు జైల్ లోపల మామిడి, కొబ్బరి తోటలు ఉన్నాయి. పండిన పంటలు ఇక్కడ ఖైదీలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. మిగులు కాయగూరలను జైల్ బయట ఏర్పాటు చేసిన సుధార్ కేంద్రంలో బయటవారికి విక్రయిస్తున్నారు. వీటిని పూర్తిగా సేంద్రియ ఎరువులతోనే పండించడం విశేషం.

నీటి సౌకర్యం పుష్కలం

పంటలు పండించడానికి జైల్ ఆవరణలో ఆరు బోర్లు ఉన్నాయి. ఆ నీటిని ఈ పంటలకు వినియోగిస్తున్నారు. దీంతో పాటు ఇక్కడ సీవేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఖైదీలు వాడుక నీటిని ఈ ప్లాంట్ ద్వారా శుద్ధిచేసి ఆ నీటిని మామిడి, కొబ్బరి తోటలకు వినియోగిస్తున్నారు. ఈ ప్లాంట్ నుంచి వచ్చిన వేస్టేజీని పంటలకు ఎరువుగా వినియోగిస్తున్నారు.

పాడి పరిశ్రమ

ఇక్కడ 2015లో ఏపీ ప్రిజన్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో అధికారులు పాడి పరిశ్రమ ప్రారంభించారు. ఇందులో మేలు జాతి రకాలకు చెందిన 10 ఆవులు, 15 గేదెలను అప్పట్లో కొనుగోలు చేశారు. వాటి నుంచి వచ్చిన పాలను ఖైదీలకు తాగడానికి, మజ్జిగ, పెరుగు కోసం వినియోగిస్తున్నారు. దీంతో పాటు జైల్లో నిర్వహిస్తున్న బేకరీకి ఈ పాలునే వినియోగిస్తున్నారు. ఈ పాడి పశువుల కోసం సుమారు రెండెకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం పెంపకం చేపడుతున్నారు. ప్రస్తుతం 60కి పైగా ఆవులు, గేదెలు, దూడలు ఉన్నాయి. ఈ డెయిరీలో పశువుల పెంపకానికి కూడా ఓపెన్ ఎయిర్ ఖైదీలు పని చేస్తున్నారు.

సుధార్ కేంద్రంలో విక్రయాలు

విశాఖ కేంద్ర కారాగారంలో వస్తు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. జైల్ లోపల పరిశ్రమల్లో ఖైదీలు తయారు చేసిన వస్తువులు, పండించిన కూరగాయలు విక్రయానికి ఉంచుతున్నారు. డెయిరీ ఉత్పత్తులు, బెడ్‌షీట్లు, తువ్వాళ్లు, బేకరీలో తయారైన రొట్టెలు, కేకులు, కూరగాయలు విక్రయిస్తున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు రూ.5 వేలు నుంచి రూ.10వేలు వరకు ఆదాయం లభిస్తోందని జైల్ అధికారులు వెల్లడించారు.


కేంద్రంలో వస్తువులు, కాయగూరల విక్రయాలు

ఇక్కడ సేంద్రియ ఎరువులతో పండించే కూరగాయలు, పరిశ్రమలలో తయారైన నాణ్యమైన వస్తువులు విక్రయిస్తుండటంతో బయటవారు వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

పంటల మార్పిడిపై దృష్టి



జైల్ ఆవరణలో ఖైదీలతో నిర్వహించే వ్యవసాయం సాగు బాగానే జరుగుతోంది. వారిలో సత్ప్రవర్తనకు దోహదపడుతోంది. ఇంత వరకు సీజనల్‌గా అన్ని రకాల పంటలు పండించాం. ఇక నుంచి పంటల మార్పిడిపై దృష్టి పెట్టాం. సీజనల్‌గా పండించే పంటలతో భూమి సారం తగ్గకుండా చర్యలు చేపడుతున్నాం. పంటల దిగుబడి బాగుంటుంది. మిగులు కూరగాయలను సుధార్ కేంద్రంలో ఉంచి విక్రయిస్తున్నాం.

– ఎం.మహేష్‌బాబు, జైల్ పర్యవేక్షణాధికారి

'ఉక్కు' అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

సీతమ్మధార: విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకంపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రధాని వెంటనే ప్రకటన చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆదివారం నగరంలోని జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద మహా ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీకే పరిమితం కాకుండా ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. ఇంకా నిర్మాణం కాని మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు గనుల కోసం ఆరాటపడుతున్న చంద్రబాబు, విశాఖ ఉక్కుకు సొంత గనుల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని ప్రధాని మోదీ చేత ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. విశాఖ పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం తన విధానంగా పెట్టుకుందని, దీనికి బాబు, పవన్ తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పద్మ, విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేఎం శ్రీనివాస్, స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, జె.అయోధ్యరాం, వై.టి.దాస్, నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, సీపీఎం విశాఖ జిల్లా నాయకులు వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, బి.ఈశ్వరమ్మ, బి.వెంకటరావు, ఎం.రాంబాబు, కె.రమాప్రభ, డి.అప్పలరాజు, వి.నరేంద్ర కుమార్, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై గీతాలను ఆలపించారు.

ప్రైవేటీకరణ కుట్రలో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ


మాట్లాడుతున్న వి.వి.రమణమూర్తి

సీతంపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిందని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం విశాఖలో ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ప్యాకేజీ ఇచ్చిన వారు.. ఆ నిధులను ప్లాంట్ అభివృద్ధికి వినియోగించకుండా షరతులు పెట్టడం దారుణమన్నారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్లలో గతంలో ఇచ్చిన రూ.1,600 కోట్లు కూడా కలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.7,350 కోట్లను బ్యాంకుల రుణానికి ఇస్తున్నారని.. మిగిలిన అరకొర మొత్తంతో పర్మినెంట్ ఉద్యోగులను వీఆర్‌ఎస్‌పై పంపించాలంటూ షరతులు పెట్టారని మండిపడ్డారు. కేంద్రం సాయంలో ఒక్క రూపాయి కూడా ఉద్యోగుల జీతాలకు గానీ, ముడి సరకు కొనుగోలుకు గానీ వినియోగించే పరిస్థితి లేదన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు కేంద్రం నిర్ణయాలకు వత్తాసు పలకడం దారుణమన్నారు. రూ.రెండున్నర లక్షల కోట్ల విలువ చేసే ప్లాంట్‌ను అత్యంత కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేందుకు కేంద్రం చూస్తోందని విమర్శించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శరత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమిస్తున్నట్లు, సొంత గనులు కేటాయిస్తున్నట్లు, నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు కేంద్రంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మురికివాడల నివాసితుల సంఘం అధ్యక్షుడు రవి, బీంసేన వార్ నాయకుడు కె.చిన్నారావు పాల్గొన్నారు.

లంకె బిందెల పేరుతో ఘరానా మోసం

- నకిలీ స్వామీజీతో కలిసి ఇద్దరు వ్యక్తులు రూ.28 లక్షలు కాజేత
- ఆనందపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఘటన
- గోప్యంగా ఉంచిన పోలీసులు

మధురవాడ: ఆధునిక సమాజంలో మూఢ నమ్మకాలతో కూడిన మోసాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. మంత్రాలతో చింతకాయలు రాలవని తెలిసి కూడా కొందరు అమాయకంగా దొంగ స్వాములను నమ్మి బలైపోతున్నారు. దీనికి ఆనందపురం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఓ ఘటనే ఉదాహరణ. మండలానికి చెందిన నలుగురి నుంచి ఓ నకిలీ స్వామితో కలిసి ఇద్దరు వ్యక్తులు రూ.28 లక్షల వరకూ వసూలు చేసి ఘరానా మోసానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఆనందపురం మండలం వేమగొట్టిపాలేనికి చెందిన కె.ఎ.రాజు, మల్కాపురానికి చెందిన పీపీ భార్గవరావు అలియాస్ మునిస్వామితో పాటు గాజువాకకు చెందిన డేరింగ్ కృష్ణ నమ్మించి మోసం చేసినట్టు సమాచారం. బీపీ కళ్లాలకు చెందిన తాతారావు సదరు నలుగురు బాధితులకు స్వామీజీని గతేడాది నవంబరులో పరిచయం చేశాడు. స్వామీజీ తన వద్ద బంగారు నిధి ఉందని, పూజలు చేయడానికి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పాడు. బాధితులు రూ.28 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. పూజలు చేస్తేనే లంకె బిందెలు దక్కుతాయని, లేకపోతే రక్తం కక్కుకుని చనిపోతారని బాధితులను స్వామీజీతో పాటు అతని మనుషులు బెదిరించారు. డబ్బులు వెంటనే ఇచ్చేయాలని డిమాండ్ చేయడంతో తాతారావుతో పాటు మరో ముగ్గురు వ్యక్తుల సమక్షంలో బాధితులు దఫదఫాలుగా మొత్తం రూ.28 లక్షలు మునిస్వామికి అందజేశారు. ఈ నెల 2న లంకె బిందెలను గుడిలోవ పరిసర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన బాధితులు తమ గెస్ట్ హౌస్‌లో భద్రపరిచారు. ఆ తర్వాత నుంచి స్వామీజీ పరారయ్యాడు. అనుమానం వచ్చిన బాధితులు స్వామీజీకి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. లంకె బిందెల్లో ఏమీ లేకపోవడంతో లబోదిబోమంటూ వారికి అత్యంత సన్నిహితులు, బంధువుల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో వేములవలస సమీపంలోని బీపీ కళ్లాలకు చెందిన బాధితుల బంధువు ఒక్కరు నాలుగు రోజుల కిందట ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి, ఆనందపురం–బోని రోడ్డులో బుద్ధుని విగ్రహం వద్ద స్వామిని, ఇతర ప్రాంతాలలో మిగతా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి పాత రాగి సామగ్రి, కారు, రూ. 70 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మునిస్వామి, రాజు, కృష్ణలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై ఆనందపురం సీఐని సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. పోలీసులు ఈ వ్యవహారం విషయంలో గోప్యత పాటించారు.

ఏం సాధించారని సంబరాలు?

- 'ఉక్కు' గాయానికి వెన్న పూశారు అంతే
- వైఎస్ జగన్ వల్లే ఇన్నాళ్లు ఆగిన ప్రైవేటీకరణ
- వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ



సీతంపేట: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే ఆత్మగౌరవ నినాదానికి ఎన్డీఏ కూటమి ముందు వాతపెట్టి ఇప్పుడు వెన్నపూస రాసి తాము ఏదో సాధించేశామని సంబరాలు చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ దుయ్యబట్టారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉండగానే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. అటువంటి బీజేపీతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన జతకట్టారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాగ్దానాలు గాలికి వదిలేసి, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.11440 కోట్ల ప్యాకేజీకి తలూపి ఏదో సాధించినట్టు టీడీపీ, జనసేన పార్టీలు పోటీపడి సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రైవేటీకరణపై బీజేపీని ఒప్పించాల్సిన బాధ్యత టీడీపీ, జనసేనలపై ఉందని, లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వంలో తమ మద్దతు ఉపసంహరించుకుని, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ఈ విషయంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని చూసి బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. రూ.2 లక్షల కోట్ల విలువైన ఉక్కు కర్మాగారాన్ని దక్షిణ కొరియాకు చెందిన పోక్సో కంపెనీకి రూ.32వేల కోట్లకే కట్టబెట్టడానికి మోదీ సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంతో ఇన్నాళ్లు ఆ ప్రక్రియ ఆగిందన్నారు. లేదంటే ఎప్పుడో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం అయ్యేదని చెప్పారు. కూటమి నాయకులకు స్టీల్‌ప్లాంట్‌పై శ్రద్ధ లేదని, అందుకే ఈ నెల 8న విశాఖలో పర్యటించిన ప్రధాని మోదీని కనీసం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని అడిగే సాహసం చేయలేకపోయారన్నారు. నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిసెంబర్‌లో ప్రధానిని చంద్రబాబు కలిసిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. రూ.25 వేల కోట్లకు పైగా అప్పులున్న ప్లాంట్‌కు కేంద్రం ఇచ్చిన 11,440 కోట్లు దేనికీ సరిపోవని కార్మికులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే రాబోయే రోజుల్లో స్టీల్ ప్లాంట్‌ను కచ్చితంగా ఒక పథకం ప్రకారం ప్రైవేటుపరం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో ఫలితం అనుభవిస్తారని ఆయన ధ్వజమెత్తారు.

కార్మిక సంఘాలపై మాధవ్ వ్యాఖ్యలు గర్హనీయం

డాబాగార్డెన్స్/సీతమ్మధార: వామపక్షాలు, స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ నాయకులపై బీజేపీ నాయకుడు మాధవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని సీఐటీయూ మండిపడింది. ఈ మేరకు సిటు జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని ప్రకటించిన నాటి నుంచి పోరాటం చేస్తున్నా ఏనాడు మద్దతు తెలపని మాధవ్.. ఆదివారం కూర్మన్నపాలెం టెంట్ వద్ద సంబరాలు చేయడం, మోదీకి క్షీరాభిషేకం చేయడం ఎవరి కోసమని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులను రోడ్డున పడేలా చేసిందే బీజేపీ సర్కారు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, గంగవరం పోర్టును స్టీల్ ప్లాంట్‌కు అప్పగించాలని, ప్రైవేటీకరించబోమని మోదీతో ప్రకటన చేయించాలని మాధవ్‌కు సూచించారు. ప్రైవేట్ వ్యక్తుల సౌలభ్యం కోసమే మోదీ ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిందని వారు ఆరోపించారు. ఏ పోరాటాలు జరగకుండా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం కోసమేనా మోదీకి క్షీరాభిషేకం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ నెల 8న ఏయూ మైదానంలో జరిగిన సభలో ఎందుకు ప్యాకేజీ ప్రకటించలేకపోయారని నిలదీశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాధవ్ ఎమ్మెల్సీ పదవికి గతంలో ఎందుకు రాజీనామా చేయలేదన్నారు. ప్యాకేజీలు శాశ్వత పరిష్కారం కాదని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోనే నడుపుతామని ప్రకటన చేసే వరకు పోరాటాలు ఆగవని హెచ్చరించారు.

గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

పీఎం పాలెం: గంజాయి ప్యాకెట్లు విక్రయించడానికి యత్నిస్తున్న నలుగురు యువకులను పీఎం పాలెం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ ఆరో వార్డు కొమ్మాది ఏపీహెచ్‌బీ రోడ్డులో కొంత మంది గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. స్థానిక ఎస్ఐ భాస్కరరావు సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. గంజాయి విక్రయించడానికి యత్నిస్తున్న కొమ్మాది రీకాన్ టవర్స్‌లో నివసిస్తున్న లోకోజీ భాస్కరరావు (20), అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న టేకు రాజేష్ (20), నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎర్రంకి దుర్గా మోహన్‌సాయి(24), రాంబాబులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1.200 కేజీల గంజాయి ప్యాకెట్లు, మూడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

రాజేష్‌కు గ్లోబల్ ట్రైనర్ అవార్డ్



ఏయూ క్యాంపస్: నగరానికి చెందిన డాక్టర్ కె.వి.ఎన్.రాజేష్ ప్రతిష్టాత్మకమైన మైక్రోసాఫ్ట్ టాప్ 100 గ్లోబల్ ట్రైనర్ అవార్డుకు ఎంపికయ్యారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో రాజేష్ ప్రతిభను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రాజేష్ ఏయూ నుంచి ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌లో పీహెచ్‌డీ చేశారు. అంతర్జాతీయంగా వేలాది మందికి సాఫ్ట్‌వేర్ రంగంలో ఆయన శిక్షణ ఇచ్చారు. సైబర్ సెక్యూరిటీపై ఆయన పలు పుస్తకాలు కూడా రాశారు.